సాక్షి ఒడిశా

సోమవారం । 8 । జనవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 5,78,930
బంగారం	18 గ్రాముల 720 మిల్లీ గ్రాములు
వెండి	18 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



బాల్య వివాహాలు నేరం

బాల్య వివాహాలను నివారించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదని శిశు సంక్షేమ సమితి అధ్యక్షుడు అశ్వినీకుమార్ మహాపాత్రో అన్నారు.

- 8లో▸



సమాజసేవే లక్ష్యం

జయపురంలోని సేవా సంస్థ సమాజసేవే లక్ష్యంగా ముందుకు సాగుతోందని సంస్థ ప్రతిష్ఠా కార్యదర్శి ప్రతాప్‌కుమార్ పట్నాయక్ అన్నారు.

- 8లో▸

న్యూస్‌రీల్

వింత శిశువు జననం



వింత ఆకారంలో జన్మించిన శిశువు

జయపురం: పుట్టిన గంటల వ్యవధిలోనే వింత శిశువు మృతిచెందిన ఘటన జయపురం సమితి జయంతిగిరి గ్రామ పంచాయతీ బలిగుడ గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దుర్యోధన హరిజన్ భార్య ప్రమీల హరిజన్ నిండు గర్భిణి. రెండో కాన్పు ఇంటి వద్దే చేయించుకునేందు సిద్ధపడింది. ఇంతలో నొప్పులు రావడంతో రామన్నగూడ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం వింత శిశువుకు జన్మనిచ్చింది. సాధారణంగా కన్నా పొడవుగా, కళ్లు, చెవులు, తల వింతగా ఉంది. కొన్ని గంటల్లోనే శిశువు మృతిచెందింది. అప్పటికి శిశువు బరువు 15 కేజీలు ఉన్నట్లు తెలిసింది. గర్భంలో శిశువు పరిపక్వం చెందకపోవడంతో ఇలా జన్మించిందని డాక్టర్లు తెలిపారు.

గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలను ధ్వంసం చేసిన పోలీస్ సిబ్బంది

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి ఖిలింగ్రమిట అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. పద్మపూర్‌లో అక్రమంగా గంజాయి సాగు జరుగుతుందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కోళ్ల వ్యాన్‌ను ఢీకొట్టిన బైక్

- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదం జరిగిన ప్రదేశం

మల్కన్‌గిరి: కోళ్ల వ్యాన్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. మరో యువకుడు గాయపడ్డాడు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎం.పి.వి.126 గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కలిమెలకు చెందిన సుజిత్ మాడీ (19), సింగ మాడీ (18), సమీర్ బెట్టిలు ఒకే బైక్‌పై మోటు ప్రాంతానికి బయలుదేరారు. ఎం.పి.వి.126 గ్రామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కోళ్లవ్యాన్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో సుజిత్, సింగ మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సమీర్‌ను కలిమెల ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సోమవారం మృత దేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

వరికుప్పలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పర్లాకిమిడి: పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జాజిపూర్ గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో వరికుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామంలోని సుధాం బిశ్వాళ్ తాను ఎకరా పొలంలో పండించిన వరికంకులను కుప్పలుగా పెట్టారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా కుప్పలకు మంటలు అంటుకున్నాయి. గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తీసుకొచ్చేసరికి కాలిబూడిదయ్యాయి. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధితుడు చెప్పారు. రెవెన్యూ నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని కోరారు.

విమానయానం..

కల సాకారం!



అధికారులతో కలిసి రన్‌వేను పరిశీలిస్తున్న పైలట్

- మల్కన్‌గిరి విమానాశ్రయంలో తొలిసారిగా ఎగిరిన విమానం
- ట్రయల్ రన్ విజయవంతం
- పర్యవేక్షించిన 5టీ అధ్యక్షుడు వి.కె.పాండ్యన్
- రేపు ఎయిర్‌పోర్టును ప్రారంభించనున్న సీఎం నవీన్



మల్కన్‌గిరిలో దిగిన విమానం

మల్కన్‌గిరి: జిల్లావాసులకు విమానయానం అందుబాటులోకి వచ్చే వేళయ్యింది. కేంద్రంలో మల్కన్‌గిరిలోని గొడిగూడ పంచాయతీలో నూతనంగా నిర్మించిన ఎయిర్‌పోర్టులో ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. ప్రత్యేక విమానంలో విచ్చేసిన 5టీ అధ్యక్షుడు వి.కె.పాండ్యన్ సమక్షంలో కొత్త విమానాశ్రయంలో తొలిసారి విమానం ఎగిరింది. మల్కన్‌గిరిలో ఒక పైలట్, ఇద్దర్ క్రూ మెంబర్లతో కూడిన విమానం దిగుతుండగా అగ్నిమాపక సిబ్బంది వాటర్ ఫ్లోతో స్వాగతం పలికారు. రన్‌వే పరిశీలించి సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. 1500 మీటర్లు మేర రన్‌వే ఉండటం సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. విమానాశ్రయాన్ని అతి త్వరలోనే ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రారంభిస్తామరి పాండ్యన్ తెలిపారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి కలెక్టర్ విశాల్ సింగ్, కొరాపుట్ బీజేడీ నేత ఈశ్వర్ పాణిగ్రహి, మల్కన్‌గిరి అభివృద్ధి మండలి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానాస్ మాడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, అదనపు కలెక్టర్ త్రినాథ్ మాఝి పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న అగ్నిమాపక సిబ్బంది

తొలిదశలో తొమ్మిది సీట్ల ఎయిర్‌క్రాఫ్ట్

భువనేశ్వర్: మల్కన్‌గిరి జిల్లాలో కొత్తగా నిర్మించిన విమానాశ్రయం సేవలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయి. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవానికి ముందు ఆదివారం విమానాశ్రయంలో నిర్వహించిన ట్రయల్ రన్‌లో వీటీ – 100 ఎయిర్ క్రాఫ్ట వినియోగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తొలి దశలో విమానాశ్రయం నుంచి 9 సీట్ల ఎయిర్‌క్రాఫ్ట్ నడుస్తుంది.తదుపరి దశలో పెద్ద విమానాల సేవల్ని అందుబాటులోకి తెస్తారు. విమానాశ్రయం రన్‌వే పొడవు 1,500 మీటర్లు, వెడల్పు 30 మీటర్లు. భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) అధికారులు మల్కన్ గిరి విమానాశ్రయం నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించారు. దాదాపు రూ.33 కోట్ల వ్యయంతో 94.5 హెక్టార్ల విస్తీర్ణంలో విమానాశ్రయాన్ని నిర్మించారు. మల్కన్‌గిరి విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతం వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు. 2018లో ప్రారంభించిన గురుప్రియ సేతు తర్వాత జిల్లాలో విమానాశ్రయం రెండో ముఖ్యమైన కనెక్టివిటీ ప్రాజెక్ట్. గురుప్రియ సేతు జిల్లాలోని కట్–ఆఫ్ ప్రాంతాలు (స్వాభిమాన ప్రాంతం), ప్రధాన ప్రాంతాల మధ్య స్థిర అనుసంధానం కల్పించింది.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



అయోధ్యరాముని శకటం ద్వారా అక్షింతల పంపిణీ



పూజలందుకుంటున్న సీతారాములు

పర్లాకిమిడి: అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠాపనోత్సవం పురస్కరించుకుని పర్లాకిమిడిలోని రాజవీధిలో ఆదివారం అక్షింతలు పంపిణీ చేశారు. సీతారామ శకటంతో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి వీటిని అందజేశారు.

కష్టమంతా బుగ్గిపాలు

- నరహరిపురంలో అగ్ని ప్రమాదం
- పదెకరాల వరి పంట దగ్ధం
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కోడూరు



కాలిపోయిన ధాన్యం కుప్పల వద్ద బాధితులు



గాయపడిన రైతును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నారాయణరావు

పర్లాకిమిడి: రైతన్నలు ఆరుగాలం శ్రమించి పండించిన పదెకరాల వరిపంట అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన గుసాని సమితి తాటిపట్టి పంచాయతీ నరహరిపురంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామంలో వరికంకులకు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు ఎగిరి పక్కపొలంలో పడ్డాయి. దీంతో క్షణాల్లో ధాన్యం బస్తాలు, వరికుప్పలకు మంటలు అంటుకున్నాయి. గ్రామస్తులు మంటలను ఆపేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బి.సూర్యనారాయణ, కొల్లి సింహాచలం, బొంగు భారతి, బూనుబల్లి ఆదినారాయణ, తామాడ సూర్యనారాయణ, పి.గోపాలరావు, పచ్చ హేమావతిలకు చెందిన పదెకరాలలో పండిన ధాన్యం కాలిబూడిద కావడంతో బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

పర్లాకిమిడి ఎమ్మెల్యే పరామర్శ..

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు నరహరిపురం వెళ్లి బాధిత రైతులను పరామర్శించారు. గాయపడిన బి.సూర్యనారాయణను ఓదార్చారు. బాధితులకు నష్టపరిహారం అందించేందుకు కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

ఒడిశా బలిజి సంఘం ఏర్పాటు



నూతన కార్యవర్గ ప్రతినిధులు

జయపురం: జయపురంలో ఆదివారం ఒడిశా బలిజి సంఘం కార్యవర్గ ఎన్నిక జరిగింది. జయపురంతో పాటు నవరంగపూర్, కొరాపుట్ జిల్లాల నుంచి పలువురు కులపెద్దలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా యాళ్ల శ్రీనివాస ఖన్నా, ఉపాధ్యక్షులుగా బల్లిడి చత్రపతి శివాజీ, పుప్పాల లక్ష్మి, కార్యదర్శిగా బరిగెడ శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా మహదాశ్యామ్ నారాయణరావు, పల్లా తవిటమ్మ, కోశాధికారిగా పుప్పాల శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా నిమ్మా శ్రీరామమూర్తి, వెలిడి శ్రీనివాసరావు, అంగజాల భరణి, ఆనాల బాబ్జి, నిమ్మ సీతాలక్ష్మి, నరహరిశెట్టి వెంకటరమణ, ఆదిమూలం మోహన, యేల్ల స్వప్న, పుప్పాల రమేష్, అంగజాల అనిల్, పుప్పాల మధు, వెలిది జగదీశ్వరరావు(ఉమ్మరకోట్), ఆనాల రాజు(నవరంగపూర్), పుప్పాల రాజశేఖర(నవరంగపూర్), సరెపల్లి ప్రహ్లాదరావు(ఉమ్మరకోట్), అంగజాల సునీల్, రెడ్నం శ్రీకాంత్, రెడ్నం నారాయణరావు (సెమిలిగుడ)లను ఎన్నుకున్నారు. జయపురంలో గతంలో ఉన్న బలిజి సంఘం ఆరేళ్లుగా పనిచేయకపోవడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని బలిజ కులస్తులను ఒకేతాటిపైకి తీసుకొచ్చేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒడిశాలో తమ కులాన్ని ఎస్ఈబీసీ(సోషియల్లీ ఎడ్యుకేషనల్లీ బ్యాక్‌వర్డ్ క్లాస్)గా ప్రభుత్వం గుర్తించినా పథకాలు మాత్రం అందడం లేదని చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

కొరాపుట్: విద్యార్థులు, యువత రాజకీయాల్లోకి రావాలని బిజూ జనతాదళ్ పార్టీ పిలుపునిచ్చింది. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సాయి కల్యాణ మండపంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి ప్రసంగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో ఈ రెండు వర్గాల భాగస్వామ్యం పెరగాలన్నారు. ఇప్పటికే 5టీ విభాగం అనేక పథకాలు ప్రారంభించిన సంగతి గుర్తు చేశారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా విధాన సభ స్థాయిలో యువజన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్వతంత్ర మండలి సలహాదారుడు ప్రదీప్ మజ్జి మాట్లాడుతూ బీజేడీలో యువతకు అన్ని పదవులలో ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. సమావేశంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, కో అబ్జర్వర్ దేవాసిస్ పాత్రో, తపస్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ఎంపీ రమేష్, ఏడీసీ ప్రదీప్, ఎమ్మెల్యే సదాశివ

జగన్నాథ రథానికి ఘన స్వాగతం..

జగన్నాథ పరిక్రమ రథానికి ఘన స్వాగతం లభించింది. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా నందాహండికి చేరుకున్న రథానికి ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ నెల 17న పూరి క్షేత్రం మరమ్మతుల అనంతరం ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో జగన్నాథ పరిక్రమ రథం పర్యటిస్తోంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, పార్టీ నాయకులు ప్రకాష్ మహంతి, రుణు జెన్న తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు



జగన్నాథ రథానికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

అమానుషం!

- నిండు గర్భిణిని హత్య చేసిన భర్త
- గౌడబంగిరిలో విషాదం



ఆస్పత్రి వద్ద రీతా కుటుంబీకులు

రాయగడ: కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. నిండు గర్భిణి అని కూడా చూడకుండా భార్యను దారుణంగా హతమార్చాడు. ఈ దారుణ ఘటన రాయగడ జిల్లా బిసంకటక్ సమితి దుకుం పంచాయతీ గౌడబంగిరిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌడబంగరికి చెందిన లక్ష్మణ్ మండంగి(28) గత ఏడాది అదే గ్రామానికి చెందిన రీతా(25)ను వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ బాగానే ఉండేవారు. ప్రస్తుతం రీతా ఎనిమిది నెలల గర్భిణి. శనివారం రాత్రి ఏదో విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రుక్తుడైన లక్ష్మణ్ ఇంటిలోని ఓ తాడును తీసుకువచ్చి భార్య మెడకు చుట్టి హత్య చేశాడు. కొద్దిసేపటి తర్వాత ఇరుగుపొరుగు వారు విషయం తెలుసుకుని రీతాను మునిగుడ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రీతా కుటుంబ సభ్యులు అందించిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌ను అరెస్టు చేశారు.

బ్యూరోకాట్ల పాలిత రాష్ట్రంగా ఒడిశా

- కాంగ్రెస్ ఇన్‌చార్జి అజోయ్‌కుమార్

భువనేశ్వర్: ఒడిశాలో అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ), భారతీయ జనతా పార్టీ (బీజేపీ)పై కాంగ్రెస్ విమర్శల స్వరం పెంచింది. ఈ రెండు పార్టీలు రాష్ట్రంలో బ్యూరోక్రాట్లు, 'బయటి వ్యక్తుల' పాలనను సులభతరం చేసేలా వ్యవహరిస్తున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ కొత్త ఇన్‌చార్జి అజోయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయటి వ్యక్తులు, బ్యూరోక్రాట్లు పాలిస్తున్న ఏకైక రాష్ట్రం ఒడిశాగా అభివర్ణించారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు అధికారం లేకుండా పోయిందని ఆరోపించారు. అధికార బీజేడీ అవుట్ సోర్సింగ్ పార్టీగా వ్యవహరిస్తుండడంతో రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని రంగాల్లో అవినీతి పెచ్చు మీరిందని దుయ్యబట్టారు. ఒడిశాలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దొందూ దొందేనని విమర్శించారు. నవీన్ పట్నాయక్ పాలనలో రాష్ట్రంలో బయటి వ్యక్తులు, అధికారుల పెత్తనంతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఈ పరిస్థితిని పారదోలి రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గనులు మరియు ఇతర రంగాలను బయటి వారికి ఇచ్చి రాష్ట్రాన్ని పేదరికంలోకి నెట్టేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులకు కొదవ లేకపోయినా ముఖ్యమంత్రి మాత్రం అన్ని అధికారాలను బయటి వ్యక్తికి ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ రెండూ కలిసి పనిచేస్తున్నాయని అజోయ్ కుమార్ ఆరోపించారు. ఈ రెండు పార్టీల లోపాయికారీ కూటమి కారణంగా ఒడిశాలో ఎన్ఫోర్సుమెంటు, ఆదాయ పన్ను శాఖల దాడులు జరగడం లేదన్నారు. ఒడిశాలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతున్నప్పటికీ, రాష్ట్రంలో ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరగకుండా మోదీ ప్రభుత్వం బీజేడీ సర్కారుకు అండగా నిలుస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్, బిజయ్‌కుమార్ పట్నాయక్, గణేశ్వర బెహరా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజోయ్‌కుమార్

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి పుష్పార్చన



వెంకటేశ్వర స్వామికి పుష్పార్చన చేసిన దృశ్యం

నరసన్నపేట: స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ఆదివారం సాయంత్రం పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ధనుర్మాసంలో మార్గశిర బహుళ ఏకాదశి (సఫల ఏకాదశి) సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు కృష్ణ బాబు తెలిపారు.

నాలుగు ఎకరాల వరి ధాన్యం కుప్పలు దగ్ధం



మిగిలిన వరి ధాన్యాన్ని కాపాడుతున్న బాధిత రైతులు

జి.సిగడాం: ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట అగ్నికి ఆహుతైపోయింది. పంట కల్లంకు తెచ్చి నూర్పు చేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ధాన్యం కుప్పలపై నిప్పులు రాలి ఒకేసారి మంటలు చెలరేగాయి. దీంతో పంట అంతా బుగ్గైపోయింది. పెంట గ్రామానికి చెందిన కిల్లారి రమణ సంబంధించిన 4 ఎకరాల వరి ధాన్యం కుప్పలు ఆదివారం కాలిపోయాయి. సుమారుగా రూ. రెండున్నర లక్షల వరకు నష్టం వాటిల్లింది. రాజాం అగ్నిమాపక శకటం వచ్చి మంటలు అదుపు చేసింది. అధికారులు స్పందించి రైతు ను ఆదుకోవాలని స్థానికులు కోరారు.

21న మాజీ సైనికుల యూనియన్ ఎన్నికలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం, అనుబంధ మండల మాజీ సైనికుల యూనియన్ ఎలక్షన్లు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం పెద్ద రెల్లివీధిలోని డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ ఆఫీస్ భవనం(ప్రస్తుత జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయ ఆవరణలో)లో ఎన్నికలు జరుగు తాయని పేర్కొన్నారు. ఫెడరేషన్ శ్రీకాకుళం సభ్యులు గానీ, అనుబంధ యూనియన్ సభ్యులు గానీ అర్హులని, శ్రీకాకుళం నగరానికి 15 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తూ ఉండాలని స్పష్టం చేశారు.

పలాసలో జాతీయ స్థాయి ఆటల పండగ



జాతీయ పోటీలకు సిద్ధంగా పలాస ప్రభుత్వ క్రీడా మైదానం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా తొలిసారి జాతీయ స్థాయి ఆటల పండగ నిర్వహించనున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13 వరకు రాష్ట్ర టెన్నీ కాయిట్ సంఘ ఆధ్వర్యంలో జిల్లా సంఘ నిర్వహణలో సీనియర్ జాతీయ టెన్నీ కాయిట్ చాంపియన్ షిప్ (పురుషులు, మహిళలు) జరగ నుంది. ఈ పోటీలకు కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.తవిటయ్య వ్యవహరించనున్నారు. ఈయన రాష్ట్ర సంఘ కోశాధికారిగా, జిల్లా సంఘ కార్యదర్శిగా ఉన్నారు. పలాస జాతీయ పోటీలకు వేదికగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఇక్కడే ఆటల్లో ఓనమాలు నేర్చుకుని జాతీయ పోటీల నిర్వహణ బాధ్యత చూసే అవకాశం రావడం అదృష్టమని అన్నారు.

దైవ నామస్మరణే ఉత్తమ సాధన

శ్రీకాకుళం కల్చరల్: భగవంతుని నామస్మరణే అన్నింటి కంటే ఉత్తమ నామస్మరణ అని దత్త పీఠం బాలస్వామి విజయానంద తీర్థ స్వామీజీ అన్నారు. స్థానిక దత్త క్షేత్రంలో స్వామీజీ భక్తులనుద్దేశించి ఆదివారం అనుగ్రహ భాషణం చేశారు. మనలోని చైతన్యం, స్పందన పెరగాలంటే దైవ నామ స్మరణ చేయాలన్నారు. గురుబోధనలు సర్వదా అనుసరణీయమన్నారు. ముందుగా దత్తక్షేత్రంలో ఉన్న దత్తాత్రేయ స్వామిని, గణపతిని, గాయత్రీ మాతను, నవగ్రహాలను, ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దత్తహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. చెంచులను కలసి వారి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో దత్తపీఠం ప్రతినిధులు జయలక్ష్మీ మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

అర్పణరథం.. పులకించిన భక్తజనం



జై జగన్నాథ అర్పణ రథం



ఖుర్దా జిల్లాలో అర్పణ రథానికి స్వాగతం పలుకుతున్న భజన, సంకీర్తన మండలి సభ్యులు

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరం ప్రాకార ప్రాజెక్టు లోకార్పణ మహోత్సవం పురస్కరించుకుని జై జగన్నాథ్ అర్పణ రథం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తోంది. లోకార్పణ మహోత్సవ పూజాదుల కోసం భక్తులు బియ్యం, వక్క అందజేస్తున్నారు. అర్పణ రథం వీటిని భక్త జనం ఇంటి ముంగిట నుంచి పూరీ మహోత్సవ ప్రాంగణానికి చేర్చుతుంది. అర్పణ రథం రాకతో గ్రామాలు, పట్టణ, నగర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది. నలు వైపుల జై జగన్నాథ్ నినాదాలు మారుమోగుతున్నాయి. మరోవైపు గ్రామం పొలి మేరల నుంచి భజన, సంకీర్తన మండళ్లు బాజాభజంత్రీలతో అర్పణ రథానికి స్వాగతం పలుకుతున్నారు. అర్పణ రథం చేరే ప్రాంతాల్లో ప్రముఖ దేవాలయాల ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించి వరి, వక్క సేకరణ ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు.



వరి, వక్క సమర్పిస్తున్న పూరీ జిల్లా సతొపొడా ఎమ్మెల్యే ఉమాకాంత సామంత్రాయ్

సమాజ సేవే లక్ష్యం

- సీవా ప్రతిష్టా కార్యదర్శి ప్రతాప్‌కుమార్ పట్నాయక్
- ఘనంగా సీవా 26వ వార్షికోత్సవం



కృష్ణ కేశవ షాడంగిని సన్మానిస్తున్న నిర్వాహకులు



ఆకట్టుకున్న సంపదామిశ్రా ఒడిస్సీ నృత్యం

జయపురం: సమాజసేవే లక్ష్యంగా జయపురంలోని సోషియల్ ఎడ్యుకేషనల్, ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా) ముందుకు సాగుతోందని సంస్థ ప్రతిష్టా కార్యదర్శి ప్రతాప్‌కుమార్ పట్నాయక్ అన్నారు. జయపురంలోని జగన్నాథ సాగర్ సమీపంలోని చిత్తబినోదన్ ఉద్యాన వనంలో శనివారం రాత్రి సీవా 26వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతికేళ్ల కిందట ఏడుగురు సభ్యులతో ప్రారంభమైన సీవా నేడు 70 మంది సభ్యులకు చేరి విజయవంతంగా అనేక సమాజ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు చేయూతనందించడంలో ముందంజలో ఉంటోందని చెప్పారు. సీవా అధ్యక్షుడు సుధాకర పట్నాయక్, కార్యదర్శి సౌమ్యరంజన దొలాయి మాట్లాడుతూ గత ఏడాది చేపట్టిన, ఈ ఏడాది నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను సభ్యులకు తెలియజేశారు. కోశాధికారి రంజన్ నాయిక్ ఆదాయం, ఖర్చులను వివరించారు. అనంతరం సేవా ప్రముఖులను సన్మానించారు. నెమలిన్ హేంబ్రమ్(వైద్యం), దేవీ మిశ్ర(విద్య),కృష్ణ కేశవ షాడంగి(పర్యావరణం) సత్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సీవా ఉత్తమ సభ్యునిగా రంజిత్ నాయిక్‌ను బహుమతితోసన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు అజయ మిశ్రా, శిశిర పట్నాయక్, ధర్మారావు, గోపాలచంద్ర సాహు, కుమారి భావన పట్నాయక్, విజయ లక్ష్మీ పాణి, కె.మోహనరావు, జి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొదలగు వారు సభాకార్యక్మాల నిర్వహణలో సహకరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



వాకతాన్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌బీఐ డీజీఎం బరువా

రాయగడ: సైబర్ నేరాల బారిన పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ భువనేశ్వర్ శాఖ డీజీఎం సత్యబ్రత బరువా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన, చైతన్యం కల్పించేందుకు వాకతన్ (నడక) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు పొదుపు మొత్తాలను ఆర్‌బీఐ అనుమతులిచ్చిన సంస్థల్లో మాత్రమే భద్రపరుచుకోవాలన్నారు. అధిక వడ్డీలు ఎరచూపి ప్రజలను మోసగిస్తున్న ఫైనాన్సియల్ సంస్థల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా యువత సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోతున్నారని చెప్పారు. అంతకుముందు ఈ ర్యాలీని జిల్లా అదనపు మెజిస్ట్రేట్ భాస్కర రైతా, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నిహారి రంజన్ కుహరో జెండా ఊపి ప్రారంభించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులు పట్టుకుని చైతన్యపరిచారు.

ఘనంగా భక్తిసంగీత సంసద్ వార్షికోత్సవం



పర్లాకిమిడిలో భక్తి సంగీత కార్యక్రమం



సత్కారం అందుకున్న కవులు, రచయితలు, గాయకులు

పర్లాకిమిడి: స్థానిక జగన్నాథ మందిరం ఆవరణలో ఆదివారం భక్తి సంగీత సంసద్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 42వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పండిత భక్త వత్సన పాత్రో పేరిట పలువురు కవులు, రచయితలు, సమాజ సేవకులకు సన్మానం చేశారు. మహాంత రామానందదాస్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒడిశా సంగీత విభావరి కార్యక్రమంలో భువనేశ్వర్‌కు చెందిన సినీ సంగీత దర్శకులు ప్రశాంత కుమార్ పాఢీ, బిష్ణు మోహన్‌లు ఆలపించిన జగన్నాథ భక్తి మాలిక శ్రోతలను అలరించింది. అనంతరం అల్లు సరోజినీ సాహుకార్, కౌన్సిలర్ జ్యోతిర్మయిదాస్, మామిడి రాజేశ్వరీ, అథ్లెట్ కిశోర్ చంద్ర రోథో, మహిళా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కళ్యాణీ మిశ్రా తదితరులును దుశ్శాలువతో సన్మానించారు. భక్తి సంగీత సంసద్ సంస్థ సాధారణ కార్యదర్శి పూర్ణచంద్ర రోథో, మనోజ్ పాఢిలు వాఖ్యాతలుగా వ్యవహరించారు.

భవనంపై నుంచి జారి పడి తాపీమేస్త్రీ మృతి

కంచిలి: మండలంలోని ముండ్ల పంచాయతీ పరిధి కేసుపురం గ్రామానికి చెందిన నిరంజన్ ప్రధాన్(59) జిల్లుండ గ్రామంలో నీలాద్రి ప్రధాన్ ఇంటి నిర్మాణ పని చేస్తుండగా, ప్రమాదవశాత్తూ సన్ షేడ్ మీద నుంచి శనివారం సాయంత్రం జారిపడ్డాడు. దీంతో తలవెనుక భాగంలో బలమైన గాయమైంది. దీంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 7.35 గంటలకు మృతిచెందాడు. దీంతో మృతుని భార్య సత్యభామ ప్రధాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ ఎస్.బాలరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ, కారు ఢీ : వ్యక్తి మృతి



రక్తమడుగులో వృద్ధుడు

కాశీబుగ్గ: పలాస మండలం శాసనాం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విశాఖ నుంచి పశ్చిమ బెంగాల్ వెళ్తున్న ఓ కారు స్కూటీపై వెళ్తున్న వృద్ధుడిని ఢీ కొట్టింది. ఆ ధాటికి కారు మూడు పల్టీలు కొట్టగా.. స్కూటీ నుజ్జునుజ్జయిపోయింది. వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తు న్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది వృద్ధుడిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన మృతి చెందారు. ఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న సవర బాపన్న

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయతీ, బొమ్మిక రిజర్వాయర్ సమీపంలో ఆదివారం ఓ ఆటో బోల్తా పడి పలువురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మిక గ్రామానికి చెందిన ఏడుగురు ప్రయాణికులు ఆటోలో తాళాడ పంచాయతీ మూర్తి గాడిగూడ చర్చికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా దారిలో రిజర్వాయర్ సమీపంలోని కొండల మధ్య ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న ఏడుగురూ గాయపడ్డారు. 108కు సమాచారం అందడంతో క్షతగాత్రులను మన్యం జిల్లా పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిలో బాపన్న అనే వ్యక్తిని శ్రీకాకుళం రిఫర్ చేశారు. పాలకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సి.డబ్ల్యూ.సి.చైర్మన్ అశ్వినికుమార్ మహాపాత్రో

పర్లాకిమిడి: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శిశు సంక్షేమ సమితి (సి.డబ్ల్యూ.సి.) అధ్యక్షుడు అశ్వినికుమార్ మహాపాత్రో అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం కిశోర న్యాయ పోలీసు సిబ్బంది ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. అదనపు జిల్లా ఎస్పీ రాజకిశోర్‌దాస్, రిసోర్సుపర్సన్ సుభాస్‌చంద్రదాస్, డి.సి.పి.యు.అరుణ్‌కుమార్ త్రిపాఠిలు హాజరై బాల్యవివాహాలు, బాలకార్మికుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైల్డ్‌లైన్ యూనిట్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు సలహాలు, సూచనలు అందించారు. తల్లిదండ్రులను పోగొట్టుకున్న పిల్లలకు ప్రభుత్వం బిజూ శిశు సురక్షా యోజన, బిజూ కన్యారత్న పథకం, భేటీ బచావ్, భేటీ పడావ్, పోస్ట్ కేర్ యూనిట్స్‌లలో పునరావాసం కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పోలీసుస్టేషన్ల అధికారులు, శిశు సంక్షేమ శాఖ, కిశోర్ న్యాయ పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబా పాదుకల ఊరేగింపు



సత్యసాయి బాబా రథంలో పాదుకలను దర్శించుకుంటున్న భక్తులు

పర్లాకిమిడి: అనంతపురం, పుట్టపర్తి నుంచి పర్లాకిమిడికి సాయిబాబా పాదుకలు చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం నగరవీధులలో సత్యసాయి పాదుకలు రథంపై ఊరేగించారు. అనంతరం రేఖానావీధిలో శ్రీషిర్డీసాయి మందిరం వద్ద ఉంచి భజన కార్యక్రమం నిర్వహించారు.శాంతి, సర్వమత ధర్మం, ప్రేమకు ప్రతీకగా సత్యసాయి బాబా నిలుస్తారని రాష్ట్ర సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు సత్యస్వరూప పట్నాయక్ తెలిపారు. కార్యక్రమం అనంతరం సాయి పాదుకలను రాజవీధిలోని సత్యసాయి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో దర్శనార్థం ఉంచారు. పది రోజుల పాటు భక్తులకు దర్శనార్థం ఉంచుతామని పట్నాయక్ తెలిపారు.

విద్యార్థులకు పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

జయపురం: మితి స్థాయి పాణి పంచాయతీ పక్షం -2024 ఉత్సవాల సందర్భంగా జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చందన నాయక్, హెచ్ ఎం శ్యామ మెహరా పర్యవేక్షణలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, తర్క్ (వాదన) విజ్ఞాన ప్రదర్శన పోటీలకు 40 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యాయి. ఉపేంద్రదీప్ ,ప్రభాత్‌రథ్, సుశ్మిత రథ్, బిశ్వరంజన్ గౌడ, సునీల్ గౌడ, ప్రకాశ చంద్ర పట్నాయక్, నృశింగ ప్రసాద్ షాడంగి, ప్రభాకర్ మహరాణ, శివరామ్ పాణిగ్రహి, సబిత పట్నాయక్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఉపాధ్యాయులు యజ్ఞేశ్వర పండా, సీఆర్‌సీసీ రౌత్ పర్యవేక్షించారు.

జేసీఐ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

శ్రీకాకుళం కల్చరల్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం అట్టహాసంగా జరిగింది. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ఈ సభకు జేసీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు జామి భీమశంకర్ అధ్యక్షత వహించి, నూతన అధ్యక్షునిగా కూన అనిల్ కుమార్‌ను సభకు పరిచయం చేశారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు గుండ లక్ష్మీదేవి, గొంప సురేష్, కేవీ రావు, సాయి సుధీర్, గీతా శ్రీకాంత్, జి.లోకనాథం, దూసి సంతోష్, జేసీఐ పూర్వపు సభ్యులు పొట్నూరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీతారామస్వామికి ప్రత్యేక పూజలు


వెండి మంటపం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం ఆస్థాన మంటపంలో సీతారామస్వామికి నిత్యకల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, వరప్రసాద్, రామగోపాల్ పాల్గొన్నారు.

కోడి పందాల స్థావరంపై దాడులు


కోడి పుంజులతో పందాల రాయుళ్లు

బొబ్బిలి: కోడి పందాలు ఆడుతున్న శిబిరంపై పోలీసులు దాడి చేసి 15 కోడి పుంజులను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మండలంలోని వాకాడ వలస శివారులోని అమ్మవారి గుడి వద్ద భారీగా కోడిపందాలు జరుగుతున్నాయనే సమాచారం అందుకున్న ఎస్సై వి జ్ఞాన ప్రసాద్ తన సిబ్బందితోవెళ్లి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. కోడి కత్తులను, 15 కోడి పుంజులను, పందెం బరిలో ఉంచిన రూ.31,260లను స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై జ్ఞానప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.

కార్టూనిస్టుకు ప్రథమ బహుమతి


బహుమతి పొందిన కార్టూన్ ఇదే

గరుగుబిల్లి: మండలంలోని రావివలసకు చెందిన ప్రముఖ కార్టూనిస్టు గుంట్రెడ్డి భాస్కరరావు (భాను)కు విజయవాడలోని గుళ్లపల్లి అరుణకుమారి స్మారక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో హాస్యానందం పత్రిక సౌజన్యంతో నిర్వహించిన తెలుగు కార్టూన్ పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ న్యూ సంతాన సాఫల్యానికి సంబంధించిన కార్టూన్‌ను తాను ఆ పోటీలకు పంపించగా ప్రథమ బహుమతి లభించిందని సంతోషం వెలిబుచ్చారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా విజయవాడలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేస్తారని తెలిపారు. కార్టూనిస్టు భాస్కరరావు 40 ఏళ్లుగా భాను పేరుతో కార్టూన్‌లు వేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

నేడు శంబర చదురుగుడికి పోలమాంబ



సాలూరు: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు గ్రామంలోని చదురుగుడికి సోమవారం చేరుకుంటారు. ఈ నెల 1వ తేదీన అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చేందుకు చాటింపు వేశారు. గోముఖి నది ఒడ్డున సోమవారం రాత్రి అమ్మవారి ఘటాలకు పూజలు నిర్వహించి, మేళతాళాలు, తప్పెడుగుళ్ల కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానిస్తారు. గ్రామంలో 14 రోజుల పాటు అమ్మవారి ఘటాల తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ రోజుల్లో చదురుగుడిలో పోలమాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.ఈ నెల 22, 23, 24 తేదీలలో అమ్మవారి జాతర నిర్వహించనున్నారు.

కూరగాయల సాగుతో లాభాలు బాగు

- జిల్లాలో 1500 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు
- ఉత్తరాంధ్రతో పాటు ఉభయగోదావరికి కూరగాయల ఎగుమతి


చౌడువాడలో సాగవుతున్న బీరపంటను చూపిస్తున్న రైతులు

పూసపాటిరేగ: జిల్లాలో మెట్ట పంటలైన చెరకు, పొగాకు, జనపనార సాగుపై ఒకప్పుడు ఆధారపడిన రైతులు లాభాలు ఆర్జించే పంటలపై ప్రస్తుతం మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో వరి, పత్తి, మినుము పంటలు సాగుచేస్తున్న రైతులు నష్టపోవడం పరిపాటిగా మారింది. దీంతో ప్రత్యామ్నాయంగా కూరగాయ పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 1500 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్, 1000 హెక్టార్లలో రబీ సీజన్‌లో కూరగాయలు సాగవుతున్నా యి. జిల్లాలో అత్యధికంగా రామభద్రపురం, జామి, నెల్లిమర్ల, మెంటాడ, పూసపాటిరేగ, బొండపల్లి మండలాల్లో అత్యధికంగా కూరగాయలు సాగు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఇక్కడి నుంచే కూరగాయలు తరలిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో కూరగాయల సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో ఇతర ప్రాంతాల్లో కూరగాయల సాగు గణనీయంగా తగ్గి దిగుమతులు తగ్గినప్పుడు ఇక్కడ పండించిన కూరగాయలకు మంచి గిరాకీ పెరిగి లాభాలు వస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు. చాలా మంది రైతులు వరి పండించే పల్లపు భూముల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు.


రోలుచప్పిడిలో సాగవుతున్న బీర

మార్కెట్‌లో ధరలు బట్టి లాభాలు

పూసపాటి రేగ మండల పరిధిలో ఎక్కువగా బీర, బెండ, వంకాయ, చిక్కుడు, గోరుచిక్కుడు. గుమ్మడి, సొరకాయ, కర్రపెండలం, మునగ, క్యాబేజీ వంటి ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఎకరా కూరగాయల సాగుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతోంది. ఎకరాకు సుమారు రూ.లక్ష పైబడి ఆదాయం వచ్చే అవకాశం ఉందని సాగు రైతులు చెబుతున్నారు.

విత్తనాలకు రాయితీ



కూరగాయల పంట సాగు చేసే రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు హెక్టార్ విస్తీర్ణంలో సాగు చేయడానికి విత్తనాలకు రూ.3 వేల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. హైబ్రిడ్ వెజిటబుల్ స్కీమ్ ద్వారా రాయితీలు ఉన్నాయి. తీగజాతి కూరగాయల సాగు చేసే రైతులకు శాశ్వత పందిళ్లు వేయడానికి ప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తుంది.

జ్యోత్స్న, ఉద్యానవనశాఖ అధికారి భోగాపురం

కూరగాయల పంటలకు రాయితీలు ఇవ్వాలి



కూరగాయలు సాగు చేసే రైతులకు రాయితీలు ఇవ్వాలి. ఇతర పంటలు సాగు చేయడం వల్ల దిగుబడులు లేక మద్దతు ధర లేకపోవడంతో ఎక్కువ మంది కూరగాయల సాగుపైనే ఆసక్తి చూపిస్తున్నారు. వర్షాకాలంలో పంటనష్టపోయిన రైతులకు రాయితీలు కల్పించాలి.

అకుల మహలక్ష్మినాయుడు, రైతు కనిమెల్ల

కుటుంబసభ్యులకు మతిస్థిమితంలేని యువకుడి అప్పగింత


కుటుంబసభ్యులకు అజయ్‌ను అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: మతిస్థిమితం లేని 19 ఏళ్ల యువకుడ్ని వన్‌టౌన్ పోలీసులు కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. మతిస్థిమితం లేని యువకుడు పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడం చూసిన వన్‌టౌన్ హెచ్‌సీ ఆవు వెంకటరమణ, ట్రాఫిక్ పోలీసులు స్టేషన్‌కు ఆదివారం తీసుకువచ్చారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఆ యువకుడిని విచారణ చేసి కృష్ణాజిల్లా పామాడ మండలం యజ్ఞవరం గ్రామానికి చెందిన జున్న అజయ్ బాబుగా గుర్తించారు. వెంటనే వారి కుటుంబసభ్యులకు సమాచారమందించారు. వారు స్టేషన్‌కు రాగా అజయ్‌ను అప్పగించారు. ఈ మేరకు అజయ్ కుటుంబ సభ్యులు సీఐకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట రాయళ్ల అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న పేకాటరాయళ్లు

గంట్యాడ: మండలంలోని జగ్గాపురం ప్రాంతంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం రాగా ఆదివారం సాయంత్రం దాడిచేసి 8మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.12,920 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

మద్యం అక్రమ అమ్మకాలపై పోలీసుల దాడి

- 116 మద్యం బాటిల్స్ స్వాధీనం


కొత్తవలస: పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో నిందితులు

కొత్తవలస: స్థానిక సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని దేశపాత్రునిపాలెం, చిన్నిపాలెం గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. దేశపాత్రునిపాలెం గ్రామానికి సమీపంలో గల 202 కాలనీకి చెందిన ఎర్రా మహేష్‌ను అదుపులోకి తీసుకుని వంద మద్యం సీసాలు, చిన్నిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు అప్పలరాజు వద్ద 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కేజీపూడిలో 20..

వేపాడ: మండలంలోని కేజీ పూడి గ్రామంలో వల్లంపూడి పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 20 మద్యం సీసాలు పట్టుబడినట్లు ఏఎస్సై బీవీ రమణ తెలిపారు. ఆదివారం నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావువద్ద 20 మద్యం సీసాలు పట్టుబడడంతో స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గిరికిపాడులో 46..

సంతకవిటి: మండల పరిధిలోని గరికిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర 46 మద్యం బాటిల్స్ పట్టుబడ్డాయి. గ్రామం సమీపంలో నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై ఎం. వాసుదేవరావు తెలిపారు.

ఉంగరాడ మెట్టలో 35..

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట సమీపంలో అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఆ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న ఈ 35 మద్యం బాటిల్స్ సీజ్ చేసినట్లు వెల్లడించారు.

గడిముడిదాంలో 100..

రాజాం సిటీ: మండల పరిధి గడిముడిదాం గ్రామ కోనేరు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 100 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ కె.రవికుమార్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై వై.రవికిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేయగా అక్రమంగా మద్యం తరలిస్తున్న బుచ్చెంపేట గ్రామానికి చెందిన కోరాడ సత్యంను అరెస్టు చేసి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం


ట్రోఫీతో క్రీడాకారుడు రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: పట్టణానికి చెందిన కొప్పర రాజ్‌కుమార్ అనంతపురంలో నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి సీనియర్స్ విభాగంలో సత్తాచాటినట్లు కోచ్ గర్భాపు సింహాచలం ఆదివారం తెలిపారు. ఏపీ ప్రభుత్వం నిర్వహించిన ఈ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు వివరించారు. దీంతో రాజ్‌కుమార్ ఫిబ్రవరి 17వ తేదీ నుంచి బెంగుళూరులో జరగనున్న ఆలిండియా నేషనల్స్‌లో తలపడనున్నట్లు చెప్పారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో 108 పైలట్ ప్రతిభ


స్వర్ణ పతకం అందుకుంటున్న ఎంఎస్ఎన్ మూర్తి

శృంగవరపుకోట: అపర సంజీవినిగా పేరుపడిన 108 వాహనంలో పనిచేసే పైలట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024లో పతకాలు పట్టాడు. రెండు రోజులుగా విశాఖపట్నంలోని రైల్వే గ్రౌండ్స్‌లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నేతృత్వంలో నిర్వహించిన 41వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్.కోటలో 108 వాహన పైలట్‌గా పనిచేస్తున్న ఎంఎస్ఎన్.మూర్తి 40+ విభాగంలో పోటీపడిన మూడు ఈవెంట్లలో పతకాల పంట పండించాడు. హేమర్ త్రో, జావెలిన్ త్రోలో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణపతకాలు, డిస్క్ త్రోలో రజత పతకం సాధించాడు. కొన్నేళ్లుగా వరుసగా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధిస్తున్న ఎంఎస్ఎన్‌మూర్తిని స్థానికులు, క్రీడాభిమానులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- అపస్మారక స్థితిలో మరో యువకుడు


సివేరి రవి మృతదేహం

శృంగవరపుకోట: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న కోళ్లఫారం వద్ద ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషయంపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి మండలం డొంకపుట్టు గ్రామానికి చెందిన సివేరి రవి(20) ఎస్.కోట పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. అనంతగిరి మండలం పెనంతి గ్రామానికి చెందిన బొంపి రామన్న(19) ఎస్.కోటలోని విశ్వభారతి ఒకేషనల్ కళాశాలలో చదువుతున్నాడు. వారిద్దరూ ఇటీవల కృష్ణాపురం గ్రామంలోని కోళ్లఫారానికి కాపలా ఉంటామని యజమానితో ఒప్పందం కుదుర్చుకుని పదిహేను రోజులుగా కోళ్లఫారం వద్ద ఉంటున్నారు. యువకులిద్దరూ ఉదయం కోళ్లఫారంలో పనులు చూసుకుని, కాలేజీకి వెళ్లిపోయి, తిరిగి కాలేజీ నుంచి వచ్చిన తర్వాత కోళ్లఫారంలో పనులు చూసుకుంటూ ఉండేవారు. కాగా ఆదివారం ఉదయం వారిద్దరూ కోళ్లఫారం వద్ద పడి ఉండడాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామస్తులు, పోలీసులు వారిని ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే రవి చనిపోయినట్లు గుర్తించిన వైద్యులు, రామన్నను విజయనగరం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో రామన్న పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సారా తాగడం వల్ల యువకులిద్దరూ ప్రమాదస్థితికి చేరి ఉంటారని స్థానికులు చెబుతుండగా, యువకుల కుటుంబీకులు స్థానిక తమ బిడ్డల్ని చంపే ప్రయత్నం చేశారంటూ ఆరోపిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు మాట్లాడుతూ దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు.


అపస్మారక స్థితిలో రామన్న

రైలు ఢీకొని యువకుడు..


అశోక్‌కుమార్ మృతదేహం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం–నర్సిపురం రైల్వేట్రాక్ మధ్యలో రైలు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటనపై జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబల్ రత్నాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైల్వేట్రాక్‌పై పడి ఉన్న గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికుల సమాచారం మేరకు పరిశీలించి కొండవాడ గ్రామానికి చెందిన తోయక అశోక్‌కుమార్ (31)గా గుర్తించారు. అయితే ఇది హత్యా? ఆత్మహత్యా? అన్న కోణంలో దర్యాప్తు చేపడుతున్నట్లు హెచ్‌సీ చెప్పారు. మృతదేహానికి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

- రహదారి విస్తరణ పనులకు శాపం
- రూ.5.50 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వీరఘట్టం రోడ్డు


వీరఘట్టం అంబేడ్కర్ జంక్షన్‌లో పైప్‌లైన్ల రిపేర్ కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తవ్వేసిన గుంత

వీరఘట్టం: గత టీడీపీ పాలకులు ఓట్ల రాజకీయం చేసి వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులను అడ్డుకున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం మాకు ఓట్లు ముఖ్యం కాదు వీరఘట్టం పట్టణ అభివృద్ధే మా లక్ష్యం అంటూ రూ.5.50 కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం వీరఘట్టం ప్రధాన రహదారి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ఈ పనులతో సంబంధమున్న ఆర్ అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల మధ్య సమన్వయ లోపం రోడ్డు పనులకు శాపంగా మారింది. రోడ్డు అంతర్భాగంలో తాగునీటి పైపులైన్స్ అమర్చడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మొద్దునిద్ర వహిస్తుండడంతో రోడ్డు పనులకు అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డును చదును చేస్తుండడం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైప్‌లైన్లు ఏర్పాటు కోసమంటూ గుంతలు తవ్వడంతో రోడ్డు పనులకు తీవ్ర ఆటంకంగా మారింది.ముఖ్యంగా రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. రెండు రోజుల క్రితం బీటీ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంతలో ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు అంబేడ్కర్ జంక్షన్లో శుక్రవారం గుంతలు తవ్వేయడంతో బీటీ పనులు ఆగిపోయాయి. సంక్రాంతి పండగలోగా వీరఘట్టం రోడ్డు పనులు పూర్తవుతాయని ఆశించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగులుతోంది.

పద్ధతి కాదు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వీరఘట్టం రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసిందని, అధికారుల సమన్వయ లోపంతో రోడ్డు పనులను గాలికొదిలేయడం సరికాదని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ సంక్రాంతి పండగలోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను సమన్వయం చేస్తున్నారు.

జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ మానుకోవాలి

- బ్యాంక్ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక జిల్లా కమిటీ డిమాండ్


వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఏఐబీఈఏ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ చర్యలను మానుకోవాలని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కమిటీ ప్రతినిధులు స్థానిక అమర్ భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. తొలుత వార్షిక క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న బ్యాంకులన్నింటినీ కొంత మంది బడా కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని కేంద్రప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ప్రజలు ప్రభుత్వ రంగ బ్యాంకుల మీద ఉన్న నమ్మకంతో వారి వద్ద ఉన్న నగదును ఆయ బ్యాంకుల్లో దాచుకుంటున్నారని, అటువంటి వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగంలో శాశ్వత ఉద్యోగ నియామకాలను జరపకుండా ఒప్పంద ఉద్యోగుల నియామకాలను జరపడానికి ప్రయత్నిస్తున్నారని ఈ చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు బీవీప్రసాద్, కార్యదర్శి మురళి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్లు ఎం.చిన్నారావు, ఎ.వెంకటరావు, ఎ.శర్మ, హరీష్, జాయింట్ సెక్రటరీ టి.రవికుమార్, వి.శ్రావణ్ కుమార్, మనోజ్ వర్మ, పి.శ్రీనివాసరావు, జీవీ భానోజీరావు, నాగభూషణరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు బుగత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ శాంతారావు ప్రతిభ


క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకుంటున్న గుణుపూరుపేట గణిత ఉపాధ్యాయుడు శాంతారావు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేట జిల్లా పరిషత్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు జి.శాంతారావు నడక, పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నంలోని రైల్వేగ్రౌండ్‌లో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో 5 కిలోమీటర్ల నడక పోటీలో బంగారు పతకం, 5 కిలోమీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించారు. దీంతో ఉపాధ్యాయుడు శాంతారావుకు పాఠశాల హెచ్ఎం కృష్ణకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మన్యంలో పర్యాటకుల సందడి


బొమ్మట్రైన్‌పై చిన్నారులు


షూటింగ్ చేస్తున్న చిన్నారులు

సీతంపేట ఏజెన్సీలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. అడ్వెంచర్ పార్కులో షూటింగ్, జెయింట్‌వీల్ వంటి సాహస క్రీడల్లో పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటు షికారు చేశారు. చిన్నారులు బొమ్మ ట్రైన్‌పై ఆడుకున్నారు. – సీతంపేట

డెల్టా విజేతల ఫలితాల విడుదల


విజేతలతో డెల్టా కార్యవర్గం

బొబ్బిలి: ఇంగ్లీషు ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మింది విజయమోహన రావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు పాఠ్యాంశాల్లో ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఆదివారం శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లా నుంచి 232 మంది పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. పార్వతీపురం మన్యం బలిజపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై ఫలితాలను విడుదల చేశారు. విజేతలుగా బి.దుర్గాప్రసాద్,అల్లు అశోక్(పాల్తేరు), జి.విశాలాక్షి (కొత్తూరు),బి.ఉపేంద్ర, జి నవీన్ (బీజే పురం),వి కుసుమలత(సాలూరు)లకు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డెల్టా సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేణు


తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వేణుగోపాలరావు

విజయనగరం: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికయింది. ప్రధాన కార్యదర్శిగా విజయనగరం జిల్లా కు చెందిన సిహెచ్.వేణుగోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలోని లయన్స్ క్లబ్ వేదికగా ఎన్నికలు జరిగినట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఎన్నికల అధికారిగా నమ్మి శ్రీనివాసరావు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(సీఐడీ) వ్యవహరించగా, ఆంధ్ర ప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ నుంచి మాణి క్యాలరావు, తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి కె.శ్రీహరి పరిశీలకుడిగా హాజరయ్యారు. వీరి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. వేణుగోపాలరావును పలువురు అభినందించారు.